క్లుప్తంగా

డ్రోన్ కెమెరాలతో ప్రమాద స్థలాల పరిశీలన



పాకాల: మండలంలోని రహదారులు, హైవేలలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను సీఐ మద్దయ్య ఆచారి డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు. బుధవారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై నేంద్రగుంట సమీపంలో, గుంత గాదంకి వద్ద రెండు ప్రమాద ప్రదేశాలను పరిశీలించారు. ఎస్పీ ఆదేశాలతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. మోటార్ సైక్లిస్టులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు విధిగా సీటు బెల్టులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీ గౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం



తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో బుధవారం మూడు కొత్త సర్వీసులకు ప్రారంభోత్సవం చేశారు. తిరుపతి నుంచి కాణిపాకానికి రోజూ మూడు ట్రిప్పుల చొప్పున రెండు సర్వీసులు, తిరుపతి నుంచి సత్యవేడుకు మరో సర్వీసును ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిపో మేనేజర్ బాలాజీ, పలువురు ఆర్టీసీ అధికారులు, టీడీపీ,జనసేన పార్టీల నేతలు పాల్గొన్నారు.

సజావుగా పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జి

పాకాల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని ఎంఈఓ బాబ్జి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న మోడల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు పేపర్లు దిద్ది ఫలితాలను ఫలితాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, శ్రీధర్, మురళీధర్, రమేష్, రాజేష్, నజీమా, శ్రీలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

స్థిరత్వంతోనే జీవిత లక్ష్యం



అవగాహన కార్యక్రమంలో అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: మనస్సును స్థిరంగా ఉంచుకుంటే జీవిత లక్ష్యాన్ని విద్యార్థులు సాధించవచ్చని హరేక్రిష్ణ మూవ్‌మెంట్ స్వామీజీ శ్రీమాన్ ప్రేమ్ భక్తిదాస్ అన్నారు. బుధవారం ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్వామీజీ ప్రసంగించారు. జీవితంలో విద్యార్థి దశ కీలకమని, విద్యనభ్యసించే ప్రతి క్రమంలో మనస్సును నియంత్రించుకోవడం ప్రధానమన్నారు. జ్ఞాన సముపార్జనలో ఇది ఎంతో కీలకమైందని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసయ్య, విభాగాధిపతి అంజన్‌బాబు, అధ్యాపకులు విజయలక్ష్మి, శ్రీదేవి, యశ్వంత్ కుమార్, రమేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన



దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి సిటీ: ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం దంత సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంతవైద్యులు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు దంత సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ఐక్యూఏసి కో–ఆర్డినేటర్ డి.పరమేశ్వర్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు డాక్టర్ శివకుమార్, బి. సులోచనా రాణి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: సినిమా డైరెక్టర్ వెంకీ అట్లూరి, సినీ నటులు సాయిదుర్గ తేజ్, దగ్గుబాటి అభిరామ్, రఘు, సప్తగిరి, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.

శేషాచలంలో ఎర్రదొంగలు



శేషాచలం కొండల్లో ఎర్ర స్మగ్లర్ల గొడ్డలి పోట్లకు అడవి తల్లి రోదిస్తోంది. నెల రోజులుగా తమిళ తంబీలు పెద్ద ఎత్తున శేషాచలం అడవుల్లోకి వివిధ మార్గాల్లో గుట్టుగా చేరి ఎర్రచందనం చెట్లను యథేచ్ఛగా నరికి వేస్తున్నారు. నంబర్–1 క్వాలిటీ లక్ష్యంగా కొండలు, కోనలు దాటుకుని లోలోపలకి చొచ్చుకు పోయి వృక్ష సంపదను కొల్లగొడుతున్నారు.

- తిష్ట వేసిన తమిళ తంబీలు
- సవాల్‌గా మారిన కట్టడి
- రూటు మార్చిన స్మగ్లర్లు

భాకరాపేట: శేషాచలం అడవుల్లోకి తమిళ స్మగ్లర్లు పెద్దఎత్తున చేరుకోవడంతో వారి కట్టడికి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్, పోలీసులు, అటవీశాఖ ప్రత్యేక కార్యాచరణతో కూంబింగ్ చేస్తున్నా ఫలితాలు సంతృప్తికరంగా ఉండటం లేదని వాస్తవ పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ స్మగ్లర్ల భరతం పట్టేందుకు యత్నిస్తున్నప్పటికీ తమిళ స్మగ్లర్లు తమ రూటు మార్చి, వారి కన్నుగప్పేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా తమిళనాడులోని వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల నుంచి ఎక్కువగా స్మగ్లర్లు అడవుల్లోకి వస్తుండడంతో వారి రాకను నెట్ వర్క్ ఏర్పాటు చేసుకుని ప్రధాన దారుల వద్ద కాపు టాస్క్‌ఫోర్స్ కాపు కాస్తోంది.

సవాల్‌గా మారిన కట్టడి

ఎన్నిరకాలుగా స్మగ్లర్ల కట్టడికి వ్యూహరచన చేస్తున్నా ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాను అరికట్టడం సవాల్‌గా మారింది. కొండలు దాటి లోతట్టు అడవుల్లోకి చొచ్చుకుని వెళ్లి కూంబింగ్ సైతం చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాన్ని గమనించి శేషాచలం అటవీ ప్రాంతంలో వంట సరుకులు, వండిన ఆహార పదార్థాలు వదిలి స్మగ్లరు పిక్కబలం చూపుతున్నారు.

నంబర్1 క్వాలిటీపై దృష్టి

ప్రస్తుతం తమిళ తంబీల దృష్టి అంతా నంబర్1 క్వాలిటీపై ఉండడంతో దుంగల సైజు, నాణ్యత ఉన్న చెట్లను గుర్తించి మరీ నరికేస్తున్నారు. తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉన్న నాణ్యమైన ఎర్రచందనం కోసం తరలి వస్తుండడంతో సుండుపల్లె, భాకరాపేట, రాజంపేట, బాలపల్లి ఫారెస్టు, రేణిగుంట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, కేవీ పల్లె మండలాల పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాల దారుల వద్ద కూడా నిఘా పెట్టారు.

వన్యప్రాణులకు పొంచి ఉన్న ముప్పు

ఈ మధ్య కాలంలో టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఎర్రదుంగలతోపాటు, ఆయుధాలు, వన్యప్రాణులను మాంసం స్వాధీనం చేసుకోవడం విదితమే. అడవుల్లో తిష్ట వేసిన స్మగ్లర్లు వన్యప్రాణులను సైతం హతమార్చి ఆరగిస్తున్నట్టు తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అటవీ సంపదతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు స్మగ్లర్ల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటోంది.

దారి మార్చిన స్మగ్లర్లు

స్మగ్లర్లు ఇప్పుడు తిరుపతి జిల్లా దారులకంటే వైఎస్సార్ కడప, అన్నమయ్య అటవీ సరిహద్దులను ఎంచుకున్నట్లు సమాచారం. ఇందుకోసం శ్రీ కాళహస్తి రూరల్ మండలం గొల్లపల్లె, వెంకటగిరి సరిహద్దుల గుండా, ఫింఛా, సుండుపల్లె, రాజంపేట మార్గాల నుంచి అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం రవాణాకు అనుకూలంగా సిద్ధం చేసిన అనంతరం వచ్చే సమాచారం మేరకు నడకదారుల గుండా వాహన రాకపోకలు జరిగే ప్రాంతానికి చేరవేసేందుకు పథక రచన చేసుకుని అడవుల్లోకి వెళుతున్నట్లు సమాచారం....

● ఆత్మీయ అభినందన



చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా నియమితులైన భూమన కరుణాకరరెడ్డిని బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో తెలుగు అకాడమీ మాజీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువ కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి ఆత్మీయంగా అభినందించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని క్రియాశీలకంగా మరింత ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు.

- తిరుపతి మంగళం

యూటీఎఫ్ మండల కార్యవర్గ ఎన్నిక



లోకేష్‌బాబు



ఎపీఎస్ఎన్ రాజు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం యూటీఎఫ్ శాఖ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోకేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్‌ఎన్ రాజు, గౌరవాధ్యక్షులుగా బాబురెడ్డి, సహాధ్యక్షులుగా రాజేష్ రెడ్డి, పరమేశ్వరి, ట్రెజరర్‌గా హరిక్రిష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా యూటీఎఫ్ తిరుపతి జిల్లా కోశాధికారి రమేష్, ఎన్నికల అధికారిగా తిరుపతి జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిర్మల, పద్మజ పాల్గొన్నారు.

నాగేంద్ర ప్రసాద్‌కు డాక్టరేట్



నాగేంద్ర ప్రసాద్

తిరుపతి సిటీ: తాళ్లమాపురం నాగేంద్ర ప్రసాద్‌కు ఎస్వీయూ డాక్టరేట్ ప్రకటించింది. దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన ఆయన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో రీసెర్చ్ సూపర్‌వైజర్ శ్రీవారి చంద్రశేఖర్, కో–రీసెర్చ్ సూపర్ వైజర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'డెవలప్‌మెంట్ అఫ్ సింథటిక్ స్ట్రాటజీస్ టువార్డ్స్ స్పైరో సైక్లిక్ ఫ్యూజ్డ్ అజా హెటిరోసైకిల్స్ అండ్ టాపియాల్ డెరివేటివ్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. దీనికిగాను ఆయనకు డాక్టరేట్ ప్రకటించినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి యం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



వేదికపై ప్రమాణ స్వీకారం చేసిన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులతో పూతలపట్టు ఎమ్మెల్యే, చిత్తూరు ఎంపీ



ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు సొంత భవనం, అలాగే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు కట్టుబడి ఉన్నామని తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తిని నాని, మురళీమోహన్ ప్రకటించారు. తుడా కార్యాలయం వద్దనున్న కచ్చపి సమావేశ మందిరంలో బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ కార్యవర్గంతో ఎన్నికల అధికారి బొమ్మల మురళి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఆర్.మురళి, కార్యదర్శిగా బాలచంద్ర, కోశాధికారిగా చంద్రబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, వేదిక్ వర్సిటీ వీసీ.రాణి సదాశివమూర్తి హాజరై మాట్లాడారు. కార్పొరేటర్ అనిత యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య, శంకర్ యాదవ్ నూతన కమిటీని ఘనంగా సత్కరించి అభినందించారు.

ఆయన సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న విభాగాధిపతి జయసుబ్బారెడ్డి

తిరుపతి సిటీ: గణిత శాస్త్ర విభాగంలో మొదటి తరం అధ్యాపకులైన విశ్రాంత ప్రొఫెసర్ హనుమంతాచారి సేవలు చిరస్మరణీయమని గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సి.జయసుబ్బారెడ్డి కీర్తించారు. ఇటీవల మరణించిన ప్రొఫెసర్ హనుమంతాచారి సంతాప సభను బుధవారం ఎస్వీయూ గణిత శాస్త్ర విభాగ సమావేశ మందిరంలో నిర్వహించారు. పలువురు సీనియర్ ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హనుమంతచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గణిత శాస్త్ర అధ్యాపకులు ఆచార్యులు భాస్కర్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, సుగుణ మ్మ, భారతి, సుధాకరయ్య, శ్రీనాథ్, రామ కృష్ణ ప్రసాద్, వెంకటరమణ, పరిశోధకులు, అకడమిక్‌కన్సల్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ రేపు

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శుక్రవారం తిరుపతిలో పాత తిరుచానూరు రోడ్డులోని తమ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే ఈ అదాలత్‌లో ముఖ్య అతిథులుగా విద్యుత్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్ హాజరవుతారని, తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని టౌన్–1, టౌన్–2, టౌన్–3, రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్బంధ శిక్షణ పేరుతో టీచర్లను శిక్షించొద్దు

తిరుపతి ఎడ్యుకేషన్ : నిర్బంధ శిక్షణ పేరుతో టీచర్లను శిక్షించడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవి.సత్యనారాయణలు ఓ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ యుగంలోనూ రెసిడెన్షియల్ శిక్షణ పేరుతో వారం పాటు టీచర్లను కుటుంబానికి దూరం శిక్షణ పేరిట మరింత ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా ప్రపంచ బ్యాంకు నిధులు ఆగిపోతాయన్న కుంటి సాకులతో ఉన్నతాధికారులు ఏకపక్షంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇలాంటి శిక్షణలకు స్వస్తి పలకాలని, అవసరమైతే ఆన్‌లైన్‌లో, అలాగే ఉపాధ్యాయులకు వీలుగా మండల కేంద్రాల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

తిరుపతి తుడా: ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

మండల సర్వసభ్య సమావేశం

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ వేముల యశోద అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామచంద్ర బుధవారం తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

అంతర కళాశాలల క్రీడల్లో సత్తా చాటిన జట్లు



ట్రోఫీని అందజేస్తున్న ప్రిన్సిపల్ సుధారాణి, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శివశంకరరెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ మహిళల అంతర్ కళాశాలల క్రీడల్లో నగరంలోని వివిధ కళాశాలల జట్లు సత్తా చాటాయి. కబడ్డీ విభాగంలో ఎస్వీయూ కాలేజ్ విన్నర్స్‌గా , ఎస్పీ డబ్ల్యూ రన్నర్స్‌గా, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విన్నర్స్‌గా, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నర్స్‌గా నిలిచాయి. ఇక, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎస్పీడబ్ల్యూ కళాశాల విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. అలాగే టేబుల్ టెన్నిస్ సింగిల్, డబుల్స్‌లో సీకాం డిగ్రీ కళాశాల, ఎస్వీయూ కళాశాల విద్యార్థినులు విన్నర్స్, రన్నర్స్‌గా, చెస్ టోర్నమెంట్‌లో విన్నర్స్, రన్నర్స్‌గా ఎస్వీయూ కళాశాల విద్యార్థినులే నిలవడం గమనార్హం. ఆయా జట్లకు ఎస్వీయూ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం శివశంకరరెడ్డి ట్రోఫీలను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

జ్యోతిర్విజ్ఞాన శోధ పత్రిక ఆవిష్కరణ



తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ జ్యోతిష్య విభాగం ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో జ్యోతిర్విజ్ఞాన శోధపత్రికను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, శ్రీశైలం శ్రీదేవి విద్యాలయ మేనేజింగ్ ట్రస్టీ కే. కాశీ విశ్వేశ్వరశర్మ, ప్రముఖ వేణు విద్వాంసులు డాక్టర్ కొమరవోలు శివప్రసాద్ హాజరయ్యారు. జ్యోతిష్య శాస్త్ర ప్రాముఖ్యతను తెలిపేందుకు పత్రికను ఆవిష్కరించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అనుమతులు



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

●సమీక్షలో ప్రణాళికా విభాగానికి కమిషనర్ ఆదేశం

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉంటేనే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలో అనధికారిక అపార్ట్‌మెంట్ల నిర్మాణం, ప్రకటన బోర్డుల రెన్యూవల్, భవన నిర్మాణ ప్లాన్ అనుమతులు, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో బుధవారం ఆమె సమీక్షించారు. అనుమతులు ఇచ్చే విషయంలో తొలుత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. అనుమతుల మంజూరులో ఎలాంటి పొరబాట్లు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడితే తొలగించాలని, అలాగే నగరంలో ప్రకటనల హోర్డింగ్స్‌కు అనుమతులు పరిశీలించి లేని వాటిని తొలగించాలని, అనుమతులు లేకుండా బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. కోర్టులో వాజ్యం ఉన్న వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు క–ృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డీసీపీ మహాపాత్ర, ఏసీపీ బాలాజీ, రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో అభివృద్ధి పనుల నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేయాలని, జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని ఉపాధ్యక్షులు ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం తుడా పరిధిలోని తిరుచానూరు సమీపంలోని పార్కును, తుమ్మలగుంట, అవిలాల చెరువులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆమె పరిశీలించి మాట్లాడారు. అలాగే తుడాకు నిధులు సమకూర్చేందుకు చేయాల్సిన పనులపై కూడా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, డీఈ బాషా, ఉద్యానవనశాఖ అధికారి మాలతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికే కీలకం



మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపల్ పద్మజ

తిరుపతి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రణాళికే కీలకమని ఈటీసీ ప్రిన్సిపల్ పద్మజ అన్నారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) రూపకల్పనపై మండలస్థాయి శిక్షకులకు శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీపై జిల్లా వ్యాప్తంగా 98 మంది ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు శిక్షకులుగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు త్వరలో మండలాలకు వెళ్లి శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలు, సర్పంచులు, కార్యదర్శుల విధులపై ఈ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీఓ రామచంద్ర, మండల శిక్షకులు రమేష్‌బాబు, రఫీ, చిరంజీవి, బాలాజీ నాయక్, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



పంటలను పరిశీలిస్తున్న మండల స్థాయి అధికారులు

చంద్రగిరి: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకానికి స్వస్తి పలికి సేంద్రియ ఎరువులను వినియోగించడంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి విజయ్ భాస్కర్ కోరారు. బుధవారం మండలంలోని దోర్నకంబాల, గంగుడుపల్లెలో పొలం పిలుస్తోంది నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులైన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల గురించి వివరించారు. మామిడిలో సస్యరక్షణ పద్ధతులను ఉద్యాన అధికారిణి శైలజ, వర్షాకాలంలో పాడి పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెటర్నరీ వైద్యుడు వినోద్ కుమార్, వ్యవసాయశాఖ రాయితీ పథకాలను అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ బాబు వివరించారు. అంతకముందు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ మనోహర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి



సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న గిరిజన సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్‌ను బుధవారం సాయంత్రం పద్మావతి అతిథి గృహంలో గిరిజన సంఘ నేతలు వినతి పత్రం ఇచ్చారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్, ఏకలవ్య ఎరుకుల సంఘం జిల్లా నేతలు చీరాలయ్య, ఈశ్వరమ్మ ఆయనకు సమస్యలు నివేదించారు. జిల్లాలో దొరవారి సత్రం–చిల్లమూరు, ఓజిలి, రేణిగుంట మండలాల్లో గిరిజనులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సూళ్లూరుపేట దొరవారిసత్రం మండలం తనియాలి ఎస్టీ కాలనీలో 100 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దొరవారిసత్రం మండలం, మినుముల మోడీ ఎస్టీ కాలనీ గిరిజనులు వంద ఎకరాలు సాగు భూమిగా తీర్చిదిద్దుకున్నా వారికి పట్టాలు ఇవ్వలేదని, అలాగే అదే మండలంలోని కల్లూరు ఎస్టీ కాలనీలో 135 ఎకరాలు 40 కుటుంబాలకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు భూమి పంపిణీ చేయలేదని, పట్టాలు ఇవ్వలేదని వాపోయారు. చిల్లమూరు ఎస్టీ కాలనీ గిరిజనులకు సోషల్ ఫారెస్ట్ అక్రమణలో ఉన్న 500 ఎకరాల భూమి భూమిలేని గిరిజనులకు పంపిణీ చేసి పట్టాలు ఇప్పించాలని కోరారు. ఓజిలి మండలం, కొండాం రాజుపాలెం ఎస్టీ కాలనీకి చెందిన 22 మందికి సర్వే నంబర్1లో 1,266 ఎకరాలు మేత పొరంబోకు భూమిని అగ్రవర్ణాలు ఆక్రమించి సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, అయితే గిరిజన యానాదులు చెట్లు కొట్టి సాగు చేస్తున్న వారిని అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో గిరిజన కుటుంబాల ఇళ్లకు దారి, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్లెమడుగు డ్యామ్‌లో చేపలు వదిలి పట్టుకునేలా జీవనాధారం గిరిజన యానాదులకు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు ఏడు గ్రామాలలో గిరిజనుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్టీ కమిషన్ సభ్యుడు

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కలిశారు. ఎస్టీలకు సంబంధించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

అమ్మవారి సేవలో టీటీడీ బోర్డు సభ్యులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని బుధవారం టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన మహేందర్ రెడ్డి, రంగశ్రీ దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల వారిని జనసేన తిరుపతి, చంద్రగిరినేతలు సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.